క్లుప్తంగా

శివాలయం పునర్నిర్మాణానికి రూ.50,116 విరాళం



మోరిలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న కుటుంబ సభ్యులు

సఖినేటిపల్లి: మోరి గ్రామంలో కొలువైన పార్వతీ సీతారామలింగేశ్వర స్వామివారి ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం మోరికి చెందిన గోపరాజు సుందరరావు, సత్యవతిల జ్ఞాపకార్థం కుమారులు రూ.50,116 విరాళం సోమవారం అందజేశారు. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు పై మొత్తాన్ని వారు ఇచ్చారు.

ఎంపీడీఓగా భవాని



మామిడికుదురు: మండల ప్రజా పరిషత్ అధికారి(ఎంపీడీవో)గా గెద్దాడ భవాని సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అనపర్తి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వరరావు రాజోలు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన భవానిని కార్యాలయ ఉద్యోగులు అభినందించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహచర ఉద్యోగుల సహకారంతో మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు.

నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మగటపల్లి గ్రామస్తులు

మామిడికుదురు: మగటపల్లి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్‌కు సోమవారం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. 2021 నుంచి 2024 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే అధికారులు విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే గ్రామంలో వసూలు చేసిన పన్నుల్లో లోపాలు ఉన్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారిలో నామన నాగేశ్వరరావు, అడబాల వెంకటేశ్వరరావు, బొలిశెట్టి జగదీష్‌కుమార్‌లతో పాటు మరో 30 మంది గ్రామస్తులు ఉన్నారు.

వరప్రసాద్‌కు బెస్ట్ టెన్నిస్ కోచ్ అవార్డు



బెస్ట్ టెన్నిస్ కోచ్‌గా అవార్డు అందుకుంటున్న వరప్రసాద్

మామిడికుదురు: ఈదరాడ గ్రామానికి చెందిన తవిటికి వరప్రసాద్ బెస్ట్ టెన్నిస్ కోచ్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ చేతుల మీదుగా ఆదివారం ఈ అవార్డు అందుకున్నానని వరప్రసాద్ సోమవారం తెలిపారు. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్ టెన్నిస్‌లో ప్రావీణ్యం సాధించారు. ఆయన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు న్యూఢిల్లీలో కోచింగ్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బెస్ట్ టెన్నిస్ కోచ్‌గా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న అతడిని సోమవారం పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ మంత్రి సంగీత వర్ధంతి



పినపళ్లలో సంగీత విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబీకులు, అభిమానులు

ఆలమూరు: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి వర్ధంతి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. కుటుంబీకులైన సంగిత గంగరాజు (పెదబాబు), సంగిత సుభాష్ ఆధ్వర్యంలో అభిమానులు పినపళ్లలో గానుగు చెట్టు సెంటర్ లోను, ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను నెలకొల్పిన మాజీ మంత్రి సంగిత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి రెండు ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసి రాష్ట్రాభివృద్ధికి తమ వంతు తోడ్పాటును అందించిన మాజీ మంత్రి సంగిత చిరస్మరణీయుడని పినపళ్ల సర్పంచ్ సుభాష్ కొనియాడారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, నామాల సుబ్బారావు, యేపూరి వీరబాబు, యనమదల శ్రీనివాసు, కొనగళ్ల ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం డబ్బా?

- ప్లాస్టిక్ డబ్బాలతో రోగాలు
- రోజూ శుభ్రం తప్పనిసరి
- వ్యాధులు కొని తెచ్చుకోవద్దంటున్న నిపుణులు



ప్లాస్టిక్ వాటర్ క్యాన్లు

రావులపాలెం: అందంగా.. రంగురంగులతో ఆకర్షించే ప్లాస్టిక్ బాటిళ్ల వెనుక ప్రమాదం పొంచి ఉంది. మార్కెట్‌లోకి వెళ్లిన వెంటనే ప్రధానంగా ఆకర్షించేవి ఈ బాటిళ్లే. వీటిని ధర తక్కువని ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తుంటారు. అందుకే ప్రతి ఇంట్లో ఇవే దర్శనమిస్తుంటాయి. ఈ క్రమంలో రావులపాలెంతో పాటు పరిసర గ్రామాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం భారీగా పెరిగింది. అయితే వాటి వెనుక ప్రమాదం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు. వీటిని సక్రమంగా శుభ్రం చేయకుంటే రోగాల బారిన పడడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్లాస్టిక్ బాటిళ్ల ద్వారా నీరు తాగుతున్నారు. నేడు ఏ అవసరానికైనా ప్లాస్టిక్ బాటిళ్లు తప్పనిసరి అయ్యాయి. తాగునీరు, మజ్జిగ, శీతల పానీయాలు.. ఇలా ఏదీ తాగాలన్నా, కొనాలన్నా, ప్రజలు వాటిపైనే ఆధారపడుతున్నారు. అయితే వాటిని ఎక్కువగా వినియోగిస్తున్నా శుభ్రం చేయడంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారు. మినరల్ ప్లాంట్‌లో చల్లని నీరు ఇచ్చే ప్లాస్టిక్ క్యాన్లు శుభ్రపరచకుండానే సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

శుభ్రం.. రోజూ అవసరం

నిత్యం వినియోగించే ప్లాస్టిక్ బాటిళ్లను తరచూ శుభ్రం చేయాలి. లేనిపక్షంలో వాటి అడుగు భాగంలో పాచి లాంటి పదార్థం ఏర్పడుతుంది. ఇందులో బ్యాక్టీరియా చేరి పెద్ద ఎత్తున వృద్ధి చెందుతుంది. దీనివల్ల గొంతునొప్పి, దగ్గు, జీర్ణకోశ, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రధానంగా నాసిరకం ప్లాస్టిక్‌తో తయారయ్యే బాటిళ్లలో సులభంగా నీరు కలుషితమవుతుంది. ఇదిలాఉండగా మినరల్ వాటర్ క్యాన్లతో వ్యాధులు వస్తాయని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వాటర్ క్యాన్లను నిర్వాహకులు పెద్దగా శుభ్రం చేయరు. ఇలాంటి క్యాన్లను వినియోగించడం కన్నా స్టీల్‌బాటిళ్లు, బిందెలు, రాగి పాత్రల్లో నీరు తాగితే ఆరోగ్యకరమని నిపుణులు చెబుతున్నారు. ఏదేమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీటిని తాగి రోగాల బారిన పడొద్దని వారు సూచిస్తున్నారు.



వివిధ ఆకృతుల్లో రంగురంగుల ప్లాస్టిక్ కూలింగ్ టిన్లు

ఇవీ అనర్థాలు

ప్లాస్టిక్ క్యాన్లు, బాటిళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే బ్యాక్టీరియా చేరుతుంది. వాటిలో గోనోకొక్కల్స్, న్యూమో కొక్కల్స్ వంటి బ్యాక్టీరియా సులభంగా వృద్ధి చెందుతుంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల గొంతు, జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వాంతులు, విరేచనాలు, జ్వరం రావొచ్చు. క్రమక్రమంగా ఆరోగ్యం క్షీణించే అవకాశాలు ఎక్కువ. నాణ్యమైన నీటి బాటిళ్లను కొనుగోలు చేయాలి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించేవి కొనుగోలు చేయొద్దు. రోజూ వేడి నీటితో బాటిళ్లను శుభ్రం చేసుకోవాలి. బ్రష్‌తో అడుగు భాగం కడగాలి. పూర్తిగా ఎండేలా చూసుకోవాలి. ఇందులో నీరు ఎక్కువగా నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి. బాటిళ్లను తరచూ మారుస్తూ ఉండాలి.

అనేక సమస్యలు



ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించడం వల్ల అనేక సమస్యలు వస్తాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులే ఎక్కువగా వివిధ రూపాల్లో ఉండే ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగిస్తుంటారు. అయితే వాటిని శుభ్రం చేయకపోవడంతో అడుగు భాగంలో ఉండే బ్యాక్టీరియా కడుపులోకి ప్రవేశిస్తుంది. క్రమంగా పిల్లలు టైఫాయిడ్, వాంతులు, విరేచనాలకు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులను నివారించాలంటే స్టీలు, రాగి బాటిళ్లను వినియోగించాలి. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

– ఎస్‌కే హసీనా, వైద్యాధికారి, పీహెచ్‌సీ, ఊబలంక

క్రీడలు ఖండాంతర బంధాలు పెంచుతాయి



అంబాజీపేటలో ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, పీడీలు, విద్యార్థులు

అంబాజీపేట: క్రీడలు ఖండాంతర స్నేహబంధాలు పెంచడమే కాకుండా ఆటల పోటీల్లో చురుగ్గా రాణిస్తారని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. ఒలింపిక్ డే రన్ సందర్భంగా అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పీడీలు కె.ఆదిలక్ష్మి, సాయిల పర్యవేక్షణలో ఒలింపిక్ రన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.

పలువురు వక్తలు రన్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ఆటలు ఆడే విధంగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రీడలు వల్ల మానసికోల్లాసంతో పాటు మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈ రన్‌లో పీఎంసీ చైర్మన్, తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు, కొర్లపాటి గోపి, గుడాల ఫణి, రవణం రాము, పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ధ్వంసం చేశారంటూ ఫిర్యాదు

ఆలమూరు: మండలంలోని చొప్పెల్లలో తమ ఇంటి వైపు ఉన్న రోడ్డును ధ్వంసం చేశారంటూ గ్రామానికి చెందిన యర్రంశెట్టి ఏసుదాసు సోమవారం అమలాపురంలో గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే స్థానిక పీహెచ్‌సీ పక్కన ఉన్న నాగిరెడ్డినగర్‌లో యేసుదాసు కుటుంబం 34 యేళ్ల నుంచి నివాసం ఉంటుంది. ఇటీవల వర్షం నీరు నిలిచిపోతుందంటూ తన ఇంటివైపు కాంక్రీట్‌తో వేసుకున్న మూడడుగుల రోడ్డును ఇంటి సమీపంలో నివసిస్తున్న ఒక కుటుంబం తమపై దాడి చేసి ధ్వంసం చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆ సమస్యపై విచారణ జరపాలని స్థానిక ఎస్సై ఎం.అశోక్‌ను, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబును ఆదేశించారు.

యువతను నిర్వీర్యం చేసింది కూటమి ప్రభుత్వమే

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి
- యువత పోరు కార్యక్రమానికి జెండా ఊపి ప్రారంభం



రావులపాలెంలో యువత పోరుకు వెళుతున్న వాహన శ్రేణిని జెండా ఊపి ప్రారంభిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



తాటిపాకలో యువత పోరు ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రావులపాలెం: రాష్ట్రంలో యువతను నిర్వీర్యం చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ సీపీ యూత్ విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యువత పోరు కార్యక్రమానికి అమలాపురం వెళుతున్న యువతకు సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జెండా ఊపి జగ్గిరెడ్డి ప్రారంభించారు. పార్టీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజువర్మ, రావులపాలెం మండల యూత్ విభాగం అధ్యక్షుడు జవ్వాది రవిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు, ఇవ్వడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని నిరుద్యోగ భృతి ఇస్తామని, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని చెప్పి, నేడు అవేమీ చేయకుండా యువతను దారుణంగా మోసం చేసిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నేడు ఆ ఉద్యోగాలు ఇవ్వడం మాట అటు నుంచి, జిల్లాలో వలంటీర్లుగా ఉన్న 15 వేల మందిని తొలగించారన్నారు. అలాగే రేషన్ వాహనాలపై ఉన్న యువతను వాటిని రద్దుచేసి నడిరోడ్డుపై నిలబెట్టి యువత వెన్ను విరిచారన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో అమలాపురం వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు సిద్ధమయ్యామన్నారు. అనంతరం 20 కార్లలో యువత అమలాపురం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గొల్లపల్లి రాజశేఖర్, ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొవ్వూరి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాటిపాకలో..

రాజోలు: లేనిపోని హామీలను ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం యువతను నట్టేట ముంచిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం కేంద్ర పార్టీ ఆదేశాల మేరకు అమలాపురం కలెక్టరేట్‌లో వద్ద చేపట్టిన యువత పోరు నిరసన కార్యక్రమానికి గొల్లపల్లి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. తాటిపాక వేంకటేశ్వర థియేటర్ వద్ద నుంచి గొల్లపల్లి పాదయాత్రగా తాటిపాక సెంటర్‌కు చేరుకుని అక్కడ ఉన్న బీఆర్ అంబేడ్కర్, దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజోలు నియోజకవర్గం నుంచి అమలాపురం తరలివెళ్తున్న ర్యాలీని గొల్లపల్లి జెండా ఊపి ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, అడబాల బ్రహ్మాజీ, కుసుమ చంద్రశేఖర్, బొలిశెట్టి భగవాన్, నియోజకవర్గ యువత అధ్యక్షుడు గుత్రం జాషువా, రాజోలు మండల యువత అధ్యక్షుడు వాసంశెట్టి శ్రీహరి, నాయకులు జంపన బుజ్జిరాజు, కూనపరెడ్డి రాంబాబు, సూరిశెట్టి బాబి, నేతల నాని తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: 'యువత పోరు' కార్యక్రమానికి అయినవిల్లి మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు అమలాపురం కలెక్టరేట్‌కు సోమవారం భారీ ఎత్తున తరలివెళ్లారు. ముక్తేశ్వరం సెంటర్‌కు చేరుకుని స్థానికంగా ఉన్న అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి అక్కడి నుంచి ర్యాలీగా తరలివెళ్లారు.

యువతను మోసం చేసిన చంద్రబాబు అండ్‌కో



అంబాజీపేటలో యువత పోరు ర్యాలీని ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

యువత పోరుకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు

అంబాజీపేట: యువతకు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికీ నెలకు రూ.3 వేల భృతి అందిస్తాం అంటూ గత సార్వత్రిక ఎన్నికల్లో యువతను మభ్యపెట్టిన చంద్రబాబు అండ్ కో నేడు ఆ ఊసే ఎత్తడం లేదని జెడ్పీటీసీ, పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు అమలాపురంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమానికి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ అధ్యక్షతన నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ర్యాలీగా సోమవారం తరలివెళ్లారు. కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల సమయంలో సర్టిఫికెట్లు తప్పనిసరి కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పార్టీ నాయకులు పీకే రావు, మందపాటి కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. అనంతరం యువతపోరు ర్యాలీని కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, దొమ్మేటి సత్యమోహన్, పేరి శ్రీనివాస్, దొమ్మేటి దుర్గారావు, సూదాబత్తుల రాము పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన బండారు శ్రీను సుగర్ ఎక్కువై మోకాలి కింద ఇన్ఫెక్షన్ కావడంతో కాలు తీసేయాల్సిన పరిస్థితిలో ఉన్నాడు. ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇంటి దగ్గరే స్థానిక డాక్టర్‌తో వైద్యం చేయించుకుంటున్నారు. వైద్యానికి సాయం చేయాలని కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను కోరారు. దీంతో సంస్థ సభ్యులు శ్రీను ఇంటికి వెళ్లి రూ.12 వేల చెక్కు అందజేశారు.

ట్రిపుల్ ఐటీకి హర్షిత్ ఎంపిక



రావి హర్షిత్

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణుడైన విద్యార్థి రావి హర్షిత్ సోమవారం ప్రకటించిన ట్రిపుల్ ఐటీ ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం నార్ని ఛాయా ప్రసూనాంబ తెలిపారు. సీటు సాధించిన హర్షిత్‌ను సర్పంచ్ పోతురాజు కిషోర్‌కుమార్, ఎంపీటీసీ చొప్పల బాబూరావు, స్థలదాత పోతురాజు నాగేంద్ర కుమార్ అభినందనలు చెప్పారు.

వ్యాన్ ఢీకొని విద్యార్థులకు గాయాలు



రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జాన్

రాజోలు: గ్యాస్‌బండల లోడ్ వ్యాన్ ఢీ కొని చింతలపల్లి కొత్త కాలనీకి చెందిన విద్యార్థులు కొల్లి జాన్, కొల్లి జెస్సిక సోమవారం గాయపడ్డారు. కొత్తకాలనీకి చెందిన జాన్ కూనవరం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. పాఠశాల నుంచి ఇంటికి సైకిల్‌పై తిరిగి వస్తూ చింతలపల్లి ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చెల్లెలు జెస్సికను సైకిల్‌పై ఎక్కించుకుని ఇంటికి వెళ్తుండగా వెనుక వైపు నుంచి గ్యాస్‌బండల లోడ్ వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సైకిల్ చక్రం విరిగిపోవడంతో అన్నాచెల్లెళ్లు ఇద్దరూ కిందపడిపోయారు. దీంతో జాన్ కుడికాలు విరిగిపోగా, జెస్సికకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరినీ రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా జాన్ కుడికాలుకు శస్త్ర చికిత్స చేయించాలని వైద్యులు సూచించడంతో జాన్‌ను రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎంఈఓలు నల్లి మనోహరం, ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజులు ఆస్పత్రికి వచ్చి గాయపడ్డ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

నల్ల బ్యాడ్జీలతో గ్రామ సర్వేయర్ల నిరసన



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సర్వేయర్లు

ఆలమూరు: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్వేయర్లు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలియజేశారు. ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామ సర్వేయర్ల సమావేశం జరిగింది. గత ఐదేళ్ల నుంచి రెవెన్యూశాఖకు అనేక విధాలుగా సేవలందిస్తున్న గ్రామ సర్వేయర్లపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి సరికాదని వ్యాఖ్యానించారు. అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న తమను సొంత మండలాలకు సంబంధం లేకుండా బదిలీలు జరపడం సరికాదన్నారు. గ్రామ సచివాలయ సర్వేయర్లందరికీ పదోన్నతులు కల్పించి రెవెన్యూశాఖలో విలీనం చేసి రెగ్యులర్ స్కేల్ వర్తింపచేసి అప్పుడే బదిలీలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ జనాభా ప్రాతిపదికన కాకుండా భూమి విస్తీర్ణాన్ని బట్టి హేతుబద్ధీకరణ చేయాలన్నారు. మహిళ ఉద్యోగుల సమ్మతి మేరకు ఇతర శాఖలకు బదిలీ చేసి అలవెన్సులు మంజూరు చేయాలని తీర్మానించుకున్నారు. అనంతరం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ కేజే ప్రకాష్ బాబుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ సర్వేయర్లు ఎదుర్కొంటున్న సమస్యలను శాఖాపరంగా పరిష్కరించుకోవాలే తప్ప నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలపడం సరికాదని తహసీల్దార్ ప్రకాష్‌బాబు హితవు పలికారు. డిమాండ్లపై స్పందించకుంటే విధులు బహిష్కరిస్తామని మండల సర్వేయర్ల సమాఖ్య తెలిపింది.

నదీ తీర ప్రాంతాల పరిశీలన

మామిడికుదురు: రానున్న వరదల సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని నదీ తీర ప్రాంతాల్లో పర్యటించారు. వరద ముంపు ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఒలింపిక్ డే రన్



ముక్తేశ్వరంలో ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్న వ్యాయామోపాధ్యాయులు

అయినవిల్లి: ముక్తేశ్వరం ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఎంఈవో పెచ్చెట్టి శ్రీనివాస్ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఎంజీ రామారావు వ్యాయామోపాధ్యాయులు ఎం.రమేష్, సీహెచ్ సత్యానందం, ఎస్.విష్ణుకుమారి, మెహర్ వాసు, ఎస్‌వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

12 మంది రక్తదానం



అమలాపురంలో రక్తదానం చేస్తున్న యువకులతో యోగా శ్రీనివాస్

కొత్తపేట: జిల్లాలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న అనారోగ్య పీడితులకు స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమం, హనుమాన్ వ్యాయామ కళాశాల నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 12 మంది రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. నిత్యం రక్తదానం నిర్వహిస్తున్న, రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న శ్రీనివాస్‌ను సోమవారం అమలాపురం ఏరియా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న గర్భిణులకు, యాక్సిడెంట్‌కు గురై రక్తం పోగొట్టుకున్న వారికి, రక్తహీనతతో బాధపడే వారికి, తలసేమియా పేషెంట్లకు 12 మంది యువకులు పి.కార్తీక్, ఎల్.దుర్గారావు, కె.సుధాకర్, సీహెచ్ నాగు, పినిశెట్టి ప్రసాద్, చిట్టూరి దుర్గ, నల్లా విష్ణు, కుంపట్ల సాయి, ఎ.బాలు, సీహెచ్ పరమేష్, వాసంశెట్టి సత్తిపండు, వెల్ల ప్రసాద్‌లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయా పేషెంట్లకు రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు. వారికి, యోగా శ్రీనివాస్‌కు రోగుల బంధువులు కృతజ్ఞతలు తెలియచేశారు. పలువురు వైద్యులు, సిబ్బంది అభినందించారు.

కొనసాగుతున్న పోలీసు పికెట్

అంబాజీపేట: స్థానిక పశువుల సంత సమీపాన ఉన్న హడ్కో కాలనీలో తలెత్తిన బాబూ జగ్జీవన్‌రాం విగ్రహ వివాదానికి సంబంధించి పోలీస్ పికెట్ కొనసాగుతుందని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ చెప్పారు. అంబాజీపేటలో ఆయన సోమవారం రాత్రి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇరువర్గాలు కలసి సామరస్య పూర్వకంగా వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివాద ప్రాంతాన్ని ఇన్‌చార్జ్ తహసీల్దార్ బి.చినబాబు సందర్శించారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

కొత్తపేట/మామిడికుదురు/పి.గన్నవరం/అయినవిల్లి: నరేంద్రమోదీ ప్రభుత్వం గత పదకొండేళ్లలో సామాన్య ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధికి అనేక పథకాలు తీసుకొచ్చిందని జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ పాట్లూరి రామ్మోహన్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. సోమవారం స్థానిక బోడిపాలెం సమీపాన మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు స్వగృహం వద్ద ఆయన అధ్యక్షతన ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల సుదీర్ఘ పరిపాలనను పురస్కరించుకొని ‹వికసిత భారత్ అమృతకాల సంకల్ప సభ› పేరుతో సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాలే శ్రీనివాస నగేష్, అయినవెల్లి సత్తిబాబు, పాలూరి జయప్రకాష్ నారాయణ, కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని సోమవారం బి.దొడ్డవరం, పెదపట్నంలంక తదితర గ్రామాల్లో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పార్టీ నాయకుడు చెరుకూరి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ముంగండ గ్రామంలో నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



పి.గన్నవరం సీహెచ్‌సీలో పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

అయినవిల్లి మండలం మాగంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని కిసాన్ మోర్చా అధ్యక్షుడు వేటుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిపారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.